


# లేడీస్ క్లబ్

## మాధవపెద్ది పుణ్యశీలా ప్రసాద్

**[హాస్య నాటిక]**

పాత్రలు :

అన్నపూర్ణమ్మ—ప్రెసిడెంట్
ఉమ—సెక్రెటరీ
మీనాక్షి
సుశీల
సీత
సరోజ
} సభ్యులు

(తెర లేవ గానే అది లేడీస్ క్లబ్‌లో ఒక మీటింగ్ హాలు. అన్నపూర్ణమ్మ, ఉమ కూచుని ఉంటారు. ఉమ ఏవో అకౌంట్లు చూస్తూ ఉంటుంది. అన్నపూర్ణమ్మ కళ్ళజోడు తీసి ముఖం తుడుచుకుంటూ అసహనంగా అటూ, ఇటూ చూస్తూ ఉంటుంది—ఎవరికోసమో ఎదురు చూస్తున్నట్లు!)

అన్నపూర్ణమ్మ : అబ్బబ్బబ్బ...ఉమా... నిజంగా ఈ క్లబ్బు ప్రెసిడెంట్ పదవి నిర్వహించడమంత తలనొప్పి ఇంకోటి లేదనుకో. ఒక్కళ్ళకీ టైము సెన్సు లేదు. కలిసి కట్టుదనం అసలే లేదు. ఇవాళ మూడు గంటలకి మీటింగుందని చెప్పామా? అయిదయినా ఒక్కళ్ళూ పూడి పడరు!

ఉమ : (తలెత్తదు. తన పని తను చేసుకుంటూ ఉంటుంది.)

అన్నపూర్ణమ్మ : (కొంచెం గట్టిగా) ఉమా!

ఉమ : (మౌనం)

అన్నపూర్ణమ్మ: (చెవి దగ్గర నోరు పెట్టి గట్టిగా) ఉమా...!

ఉమ : అబ్బ ఏమిటండీ?

అన్నపూర్ణమ్మ : నీకూ నేనంటే విసుగు పుడుతోందీ?

ఉమ : (విసుగ్గా) ఒక్క పని చెయ్యరు. ఇంకోళ్ళని చెయ్యనీరు.

అన్నపూర్ణమ్మ : ఏమిటే నన్నేనా అంటున్నావు—నీ కెన్ని గుండెలు?

సీత : (ప్రవేశిస్తూ) అందరికీ ఉండేది ఒక్కటే గుండె!

ఉమ : ఏమిటి సీతా ఇంత ఆలస్యం? మూడు గంటలంటే ఆరు గంటలకా రావడం?

సీత : హియర్—హియర్! ఇంకా ఆరు కాలేదు, మై డియర్! సినిమా చిన్నది కాబట్టి ముందరే అయిపోయింది.

అన్నపూర్ణమ్మ : ఏమిటీ? సినిమానా?

సీత: అవునండీ. మాట్నీ కెళ్ళాం. ఇవాళ మా ఆయన వూళ్ళో లేరుగా?

సుశీల : (వస్తూ) పెద్ద! ఆయన ఉంటే భయపడ్డట్టూ—నీ సంగతి నాకు తెలీదూ? నీకు తెగ సినిమాల పిచ్చి. ఆయన్నట్లా ఆఫీసుకు పంపించేదీ—ఆ తరువాత మార్నింగ్ షోలూ, మాటనీలూనూ! (సీత కొరకొరా చూస్తుంది)

అన్నపూర్ణమ్మ: సరేగానీ, సుశీలా నువ్వెందు కింత ఆలస్యం చేసినట్టు?

సుశీల : సంతానమ్మగారింట్లో పేరంటం కదండీ. అదయ్యాక సరాసరి ఇక్కడికే వస్తున్నా. మళ్ళీ వర్షం వస్తుందన్నారు!

మీనాక్షి: (ప్రవేశం) చస్తున్నాం, ఈవిడా, ఈవిడ మూడ నమ్మకాలూను!

సుశీల : మధ్యలో నీకేం? జాగ్రత్తగా మాట్లాడు.

అన్నపూర్ణమ్మ: ఆఁ ఆఁ! ఆగండి! ఏం, మీనాక్షీ! నీ కెందు కాలస్యం అయిందీ?

మీనాక్షి : నిజం చెప్పమంటారా? అబద్ధం చెప్పమంటారా?

సుశీల : అసలు నువ్వు చెప్పేవన్నీ అబద్ధాలేగా? ఏదో ఒకటి చెప్పు.

అన్నపూర్ణమ్మ : మీరిద్దరూ చుట్టాలా, స్నేహితులా?

ఉమ : అదేం అట్లా అడిగారు?

అన్నపూర్ణమ్మ : ఏం లేదు. చీటికీ మాటికీ పోట్లాడుకునేది చుట్టాలు. లేకపోతే స్నేహితులు.

సీత : ఏమిటి లేకపోతే? చుట్టాలు కాకపోతేనా? పోట్లాడుకోకపోతేనా?

అన్నపూర్ణమ్మ : పోట్లాడుకోపోతేనే స్నేహితులు! ఇంతకీ, మీనాక్షీ! నీ ఆలస్యం సంగతి చెప్పావు కాదు.

మీనాక్షి : ఏం లేదండీ. మధ్యాహ్నం బాగా నిద్రపోయాను. లేచేటప్పటికీ అయిదయిపోయింది. గబగబా రెడీ అవుదామంటే చీర దొరుకుతే మాచింగ్ జాకెట్టు కనబడదు. జాకెట్టు కనబడితే మాచింగ్ చీర దొరకదు! రెండూ కుదిరితే చెప్పులూ, గాజులూ మాచ్ కావు. నాకేమో మాచింగ్ లేకుండా బయటి కెళ్ళాలంటే చాలా చికాకు! అందుకే ఆలస్యమయింది.

ఉమ : అన్నపూర్ణమ్మగారూ! ఈ ఆలస్యాలవల్లే పుణ్యకాలం మించిపోయిందంటే మీరింకా వాటి

# పట్టుదలతో సాధించిన విద్యాభ్యాసం

స్త్రీ జీవితం కట్నం అనే అడకత్తెరలో చిక్కుకున్న జాతకం!

21 వ శతాబ్దంలో జీవిస్తూ, సంఘ సంస్కరణల పవనలు వెల్లివిస్తూన్నా మహిళ భవిష్యత్ పొలిమేరల్లో ఆ కట్న పిశాచి కబంధ హస్తాల ఝళిపింపుల భయం పోలేదు.

అయినా మనసుంటే ఉపాయం ఉంటుంది కదా.



అందుకే — కట్నం భయంతో చదువు మధ్యలోనే మానిపించారు చదువే ధ్యేయంగా గల శ్రీమతి లక్ష్మి ని.

సెవెన్త్ ఫారంతోనే చదువు ఆపించారు అమ్మాయిని తలిదండ్రులు. అయితేనేం — పెళ్ళి అయి అత్తవారింటికి వెళ్ళిన జి. లక్ష్మి మ్మ భర్త పప్పాదయు ప్రోత్సాహంతో వరుసగా మదనపల్లెలో బి. ఎ. చదివింది. అనంతపురంలో ఎం. ఎ. పూర్తిచేసింది. అంతటితో ఆగిందా — మైసూరు యూనివర్సిటీలో పి హెచ్. డి. తీసుకుంది. మరి పట్టుదల— ముదితల్ నేర్వగరాని విద్యకలదే!

కారణాలు రాబట్టడానికో గంట చేస్తున్నారు.

అన్నపూర్ణమ్మ : సరే లేవోయ్...ఇంతకీ అంతా వచ్చినట్టేనా? సరోజ రానట్టుందే?

సుశీల : ఆవిడే వస్తుంది లెండి. మనం మొదలు పెడదాం మీటింగు.

అన్నపూర్ణమ్మ : ఆ సరే. కానివ్వండి.

(అందరూ కూర్చుంటారు)

ఉమ : (లేచి) ఇప్పుడు మన ప్రెసిడెంటు శ్రీమతి అన్నపూర్ణమ్మగారు మాట్లాడతారు (అని కూచుంటుంది.)

అన్నపూర్ణమ్మ : (లేచి) డియర్ ఫ్రెండ్స్! మన కమిటీ అంతా కలిసి పని చేయడం ప్రారంభించి ఒక సంవత్సరం కాబోతోంది. ఈ సంవత్సరంలో మనం ఎన్నో నూతన ప్రయోగాలు చేశాం. చివరగా మనం ఇంకా కొన్ని కొత్త విధానాలు ప్రవేశపెట్టాలని నా కోరిక. దాంట్లో మొదటిది మన లేడీస్ క్లబ్ పేరు 'నవీన మహిళా మండలి' అని తెలుగులోకి మార్చాలన్నది. (అందరూ చప్పట్లు కొడతారు)

సరోజ : (ప్రవేశిస్తుంది.) చూశారా...చూశారా! నేనంటే మీ అందరికీ చిన్న చూపే. నేను రాకుండానే మీటింగు మొదలుపెట్టేశా రన్న మాట! నేనూ మీలాగే డబ్బుకట్టే క్లబ్‌లో చేరానే?

సీత : (అందుకుని) ఇంకా రాత్రికి రా. నీ కోసం ఆగుతాం!

సరోజ : మీరు మాత్రం ఎంత ముందు వచ్చా రేమిటి? నేను చూస్తూనే ఉన్నా—ఎవరెవరు ఎప్పుడు వెళ్ళిందీను!

సుశీల : చూస్తే మాతోపాటే వచ్చి ఉండగూడదూ?

సరోజ : ఆ వచ్చేదాన్నే. కాని, మీరసలు నా కోసం ఆగుతారా, లేదా అని చూడ్డానికే నే నాలస్యం చేశాను.

ఉమ, మీనాక్షి : ఏమిటి?

సరోజ : అవును. ఎప్పుడూ మీరు నేను రాకముందే ఏ ప్రోగ్రాం అయినా ప్రారంభించేస్తారు. ఇది కావాలనే చేస్తున్నారని ఇవాళ్టితో తేలిపోయింది. ఇంక నేనీ క్లబ్బుకి చస్తే డబ్బు కట్టనుగాక కట్టను!

అన్నపూర్ణమ్మ : ఆఁ ఆఁ. గొడవాపండి. ఇప్పటికే ఆలస్యమయింది. ఇంతకీ మనం ఎక్కడిదాకా వచ్చాం?

సుశీల : మేడమ్! ఉపోద్ఘాతం లేకుండా మూడు ముక్కల్లో చెప్పెయ్యండి. విని వెళ్ళిపోతాం— ఇక్క డెవరూ గెస్ట్‌లు లేరుగా?

సీత : అవునండీ. ఇంటి కెళ్ళి వంట కూడా చెయ్యాలి.

అన్నపూర్ణమ్మ: సరేనర్రా! ఇంతకీ నేను చెప్పబోయే దేమిటంటే సంక్రాంతి సందర్భంగా మన క్లబ్బు తరపున ఒక కొత్త రకం పోటీ నిర్వహించాలనుకుంటున్నాను. ఏదయితే బాగుంటుందో మీరు ఆలోచించి చెప్పండి. కూచో, సరోజా!

సరోజ : (విసురుగా కుర్చీ లాక్కుని కూచుంటుంది)

మీనాక్షి : ఆఁ. నాకోటి తోస్తోంది. వంటల పోటీ పెడితే?

సుశీల : అంటే నీ ఉద్దేశం. పొయ్యీ గిట్రా ఇక్కడికే తెచ్చి వండాలనా?

మీనాక్షి : ఆహా. అది కాదు. వండిన పదార్థాలు తెస్తే అవి ఎంత రుచికరంగా ఉన్నాయో దాన్ని బట్టి ప్రైజు లివ్వడం!

సీత : కేవలం రుచి కొక్కదానికే ప్రాముఖ్యం ఇవ్వడం అంత సమంజసం కాదు. వండే టైమూ వాడే పదార్థాలూ వగైరా—వగైరా కూడా చూడద్దూ?

ఉమ : అదీగాక ఇంట్లో చేసి తెస్తే ఎవరు చేశారో ఎట్లా తెలుస్తుంది? ఆవిడే చేసిందో లేకపోతే...

సరోజ: (అందుకుని) ఆవిడ మొగుడే వండాడో, లేకపోతే అత్తగారే చేసిందో...

సుశీల : (ఆశ్చర్యంగా) అప్పుడే నీ కోపం పోయిందా, సరోజా?

మీనాక్షి : సరోజ కోపం ఎంత? ఈ క్షణం ఉంటుంది. మరు క్షణం పోతుంది.

అన్నపూర్ణమ్మ : కాబట్టి వంటలు రూల్డ్ అవుట్. అవునా? త్వరగా ఇంకేదన్నా ఆలోచించండి. కొత్త రకంగా ఉండాలి. ఎవ్వరూ ఎప్పుడూ దాన్ని నిర్వహించి ఉండగూడదు.

ఉమ : ఈ దెబ్బతో మన నవీన మహిళా మండలి పేరు పైకి పోయి ఆకాశమంత పెరగాలి!

(అందరూ ఆలోచనలో పడతారు)

సుశీల : (లేచి) కుట్లు—టైలరింగ్ పోటీ పెడితే?

మీనాక్షి : పాత చింతకాయ పచ్చడి!

సీత : పోనీ ముగ్గుల పోటీ?

ఉమ : ఊహూ.

సరోజ : అందాల పోటీ?

సీత : అవన్నీ కామనే. కొత్త దంటున్నారుగా?

అన్నపూర్ణమ్మ: నా కొకటి తడుతోంది. మీరు ఒప్పుకుంటే—

ఉమ : ఏమిటది?

అన్నపూర్ణమ్మ: మనం—అంటే ఆడవాళ్ళం—మనకి ఎప్పుడూ ఇల్లు, పిల్లలు మొగుడు, సంసారం ఇవే ముఖ్యం అనుకుంటాం. మనం అనుకోవడమే కాదు. ముఖ్యంగా ఈ మగవాళ్ళు అనుకుంటారు. ఇందులో భార్యాభర్త లిద్దరికీ సగభాగం ఉందని ఎవ్వరూ అనుకోరు అవునా? (అందరూ తలలూపుతారు.) మన ప్రపంచం వీటి చుట్టూనే తిరుగుతూనే ఉంటుంది ఎప్పుడూ. ఉండాలి కూడా! కాని ఒక్క రోజు ఒకే ఒక్క రోజు మనం ఈ ప్రపంచానికి దూరంగా ఉంటే ఎట్లా ఉంటుంది?

ఉమ : ఇంతకీ మీరు చెప్పేది?

అన్నపూర్ణమ్మ : అంటే ఏం లేదు. ఒక్క రోజు పొద్దున్నే ఇంట్లో అన్నీ వదిలేసి ఇక్కడికి వచ్చెయ్యడం. మళ్ళీ రాత్రికి ఇంటికి వెళ్ళడం. ఇంతే.ఇదీ పోటీ!

సరోజ : ఇదేం పోటీ? ఇది పోటీ ఎట్లా అవుతుంది?

సుశీల : అవును ఇదేం పోటీ— విచిత్రంగా ఉందే?

సీత : అంటే మొగుడూ, పెళ్ళాలు ఒకళ్ళ పను లొకళ్ళు మార్చుకోవడమా?

అన్నపూర్ణమ్మ : అహ. మార్చుకోవడం కాదు. ఒక్క రోజు మనం ఏ పని చెయ్యం. భోజనం చెయ్యడం అదీ హోటల్లో. కబుర్లు, ఆటలు పాటలు...రిలాక్స్. అంటే పిల్లలు, పాలు నీళ్ళూ ఇల్లు ఊడవడం, బట్టలు ఉతకడం, వంట, అంట్లూ నథింగ్. ఏం అర్థం అయిందా?

మీనాక్షి : ఆ అర్థం అయింది కానీ, దేన్నిబట్టి ప్రైజులు నిర్ణయిస్తారు?

అన్నపూర్ణమ్మ : అదే...అదే చెబుతున్నా.ఎవరు ఎక్కువ రిలాక్స్ అయితే, ఎవరు ఎక్కువ డిటాచ్‌డ్‌గా ఉంటే వాళ్ళకి ఫస్ట్ ప్రైజు. అదే విధంగా సెకండ్ అండ్ థర్డ్ ప్రైజులు ఉంటాయి.




సీత : ఎవరు ఎక్కువ రిలాక్సడో ఎట్లా తెలుస్తుందంటారు?

అన్న పూర్ణమ్మ : ఒక పానెల్ ఆఫ్ జడ్జీలు ఉంటారు. వాళ్ళు పోటీలో పాల్గొన్నవాళ్ళ ఇళ్ళకి వెళ్ళి పరిశీలించి, ఇక్కడ కూడా చూసి నిర్ణయిస్తారు.

మీనాక్షి : ఇది బాగానే ఉంది.

సరోజ : అవును. సులువు కూడాను.

సుశీల : ఒక్క రోజయినా ఆ పేరున హాయిగా ఉండవచ్చు.

అన్న పూర్ణమ్మ : దీనికీ కొన్ని నిబంధనలు ఉన్నాయి. అవి ఏమిటంటే—ఒకటే: ఎవరయినా పాల్గొనవచ్చు. కానీ, పెళ్ళయిన వాళ్ళయితే మంచిది.

సీత : మరి కానివాళ్ళకి కోపం రాదూ?

ఉమ : కానివాళ్ళని జడ్జీలుగా పెడదాం.

మీనాక్షి : ఆఁ. మంచి అయిడియా.

అన్న పూర్ణమ్మ : రెండు—ఆ రోజున ఇంటి గురించి ఆలోచించగూడదు. పట్టించుకోగూడదు. మూడు: ఆరోజుకోసం ఏవిధమైన ప్రత్యేకతలూ తీసుకోకూడదు. అంటే ముందే పచ్చళ్ళవీ చేసి ఉంచడం, పిండివంటలు చేసి డబ్బాల్లోపొయ్యడం లాంటివి చెయ్యగూడదు. రోజూ మీరు పొద్దున్నే నిద్ర లేచేసరికి ఇల్లు ఎట్లా ఉంటుందో ఆ రోజు గూడా అట్లాగే వదిలేసి రావాలి. నాలుగు : ఆ రోజు ఇక్కడ్నించి ఇళ్ళకి కబుర్లు చెయ్యడంకానీ, ఫోన్‌లలో మాట్లాడడం కానీ చెయ్యగూడదు.

ఐదు : మనం లేముగదా అని ఆ రోజు కోసం ఏ చుట్టాన్నో పిలిపించుకుని ఇల్లు అప్పజెప్పగూడదు. ఇల్లు పూర్తిగా మగవాళ్ళకి వదిలెయ్యాలి.

ఆరు : పొద్దుట్నుంచీ సాయంత్రందాకా ఆ రోజు ఇక్కడే ఉండాలి. ఆరు నూరయినా, నూరు ఆరయినా ఇంటికి వెళ్ళగూడదు.

ఏడు : తుది నిర్ణయం న్యాయ నిర్ణేతలదే. ఇవీ నిబంధనలు.

సుశీల : ఏడు నిబంధనలు ఏమిటండీ. ఇంకోటి చేర్చండి. ఏడు నెంబరు మంచిది కాదు.

అన్న పూర్ణమ్మ : సరే ఇంకోటి అంటే ఎనిమిదవది : ఈనిబంధనలన్నీ స్ట్రిక్టుగా పాటించేవాళ్ళే పోటీకి అర్హులు.

సరోజ: మరి ప్రైజులేమిటి?

సీత : అవీ ఈ సారి కొత్తగానే ఉండాలి.

అన్న పూర్ణమ్మ : అవును కొత్తవే. ఫస్టు ప్రైజు కంచి పట్టు చీర!

సుశీల : ఆ! పట్టు చీరా? ఎన్నాళ్ళనించో నేను కొనుక్కోవాలనుకుంటున్నాను!

మీనాక్షి : పండగొస్తోంది కూడాను!

అన్న పూర్ణమ్మ : సెకెండ్ ప్రైజు ధర్మవరం పట్టు చీర.

ఉమ : ధర్మవరం మన్ని కెక్కువట. నా దగ్గిర కంచివి ఉన్నాయి గాని, ధర్మవరంవి లేవు.

అన్న పూర్ణమ్మ : మూడో ప్రైజు గుంటూరు జరీ చీర.

సరోజ : నా కది వచ్చినా చాలు!

సీత : బ్లవుజు పీసులు కూడా ఇస్తారా?

అన్న పూర్ణమ్మ : అదింకా నిర్ణయించలేదు.

ఉమ : పోటీ ఎప్పుడు పెడదామంటారు?

అన్న పూర్ణమ్మ : వచ్చే ఆదివారం. అందరికీ వీలేనా? మగవాళ్ళు ఇంట్లోనే ఉంటారుగా!

సీత : ఆదివారమా? మేము పిక్నిక్కుకి వెళ్దామనుకున్నామే. పోన్లే పై వారానికి వాయిదా వేస్తాం.

అన్న పూర్ణమ్మ : అయితే ఆదివారానికి అందరూ ఒప్పుకున్నట్టేగా? పొద్దున ఏడున్నరకల్లా పోటీలో పాల్గొనేవాళ్ళు ఇక్కడుండాలి!

అం : సరే అట్లాగే.

ఉమ : ఈ సభ ఇంతటితో సమాప్తం చేస్తున్నాం. ఇంక వెళ్దామా?

(అందరూ వెళ్ళిపోతుండగా...తెర)

## 2

(అదే హాలు. అన్న పూర్ణమ్మ మాత్రం ఉంటుంది. విసుగ్గా టైము చూసుకుంటూ, అటూ ఇటూ తిరుగుతూ ఉంటుంది.)

అన్న పూర్ణమ్మ : వీళ్ళ ఇళ్ళు బంగారంగానూ! తొమ్మిదవుతోంది. ఇంకా ఎవరూ రాలేదు. ఎప్పుడు మొదలుపెట్టడం పోటీ? ఎప్పుడూ ఇంతే కదా. ఒక్క రోజన్నా టైము పాటించరు!

(అంతలో ఒకళ్ళ వెనకే ఒకళ్ళు అందరూ ప్రవేశిస్తారు..)

అమ్మయ్య వచ్చేశారా? ఇంత ఐకమత్యం ఎప్పట్నించీ? అంతా కలిసి ఎట్లా రాగలిగారు?

ఉమ : పొద్దున్నే రెడీ అవగానే మీనాక్షి మా ఇంటికి వచ్చింది. ఇద్దరం కలిసి, దారే కదా అని సుశీలగారింటికి వెళ్ళాం.

సుశీల : అక్కడ్నించీ వస్తుంటే దార్లో కలిశారు సీతా, సరోజా. అంతా కలిసి ఇట్లా వచ్చాం.

అన్న పూర్ణమ్మ : పోటీ మొదలుపెడదామా? మీరు రేడీయేనా?

సరోజ : మరి జడ్జీలు?

అన్న పూర్ణమ్మ : జడ్జీలు ముందు మీ ఇళ్ళకి వెళ్ళి తరువాత ఇక్కడికి వస్తారు!

అందరు : (గతుక్కుమన్నట్లు చూస్తారు.)

అన్న పూర్ణమ్మ : ఇప్పుడు తొమ్మిదయింది. కరెక్ట్‌గా తొమ్మిదింటికి మొదలుపెడుతున్నాం. ఇది సాయంత్రం ఆరింటికి సమాప్త మవుతుంది. ఈ క్షణంనించీ మీరు పోటీలో ఉన్నట్లే! (కాసేపు అందరూ ఏం చెయ్యాలో తెలీనట్లు మొహాలు పెడతారు.)

అన్న పూర్ణమ్మ : ఇవిగో పుస్తకాలు. ఇవిగో కేరమ్స్. చెస్ బోర్డులు. అదిగో రేడియో, రికార్డు ప్లేయరూ అక్కడున్నాయి. ఇవిగో మాగజైన్లు. ఇంక మీ ఇష్టం!

(అన్న పూర్ణమ్మ వెళ్ళి కుర్చీలో కూచుంటుంది. సీత పుస్తకం పట్టుకు కూచుంటుంది. మీనాక్షి సీత పక్కనే కూచుని మాగజైను తిరగేస్తూ ఉంటుంది. ఉమ, సుశీలా చెస్ ముందు కూచుంటారు.)

(సరోజ రేడియో ఆన్ చేస్తుంది.)

సుశీల : (చిన్నగా) ఉమా! జడ్జీలుగా పెళ్ళికాని పిల్లల్ని వెయ్యడమేమిటి? అది నీ అయిడియానేనా? వాళ్ళు మనిళ్ళకి వెళ్ళి ఏం చేస్తున్నారో.


ఉమ : ఉష్ చిన్నగా మాట్లాడు. ఆవిడ విన్నదంటే... అస లీ పోటీనే వింతగా లేదూ?

సుశీల : అవునమ్మా...ఇదేం పోటీ? పసికుంక మా బాబు ఎట్లా ఉన్నాడో? ఏమో...అంతకీ పాలు కలిపి సీసాలో పోసి వచ్చానులే...అనుకో! అయినా, ఆయన కెట్లా తెలుస్తాయి ఇవన్నీ? నా మనసు నిలవడం లేదు. పిల్లాడు ఏడుస్తున్నాడో, నిద్ర పోక మారాం చేస్తున్నాడో. ఇది మానేసి వెళ్ళిపోదామా అనిపిస్తోంది!

మీనాక్షి : నాకూ అట్లాగే ఉందండీ. కానీ, పట్టు చీర కోసం సహిస్తున్నా. మా వెడ్డింగ్ ఆనివర్సరీ వస్తోంది. పట్టు చీర కట్టుకోవచ్చు కదా అని!

సుశీల: నే నందుకు కాదండీ! వెధవది పట్టు చీరలు బోలెడు కొన్నారు మా వారు. తీరా వచ్చాక వెళ్ళడం బావుండదని చూస్తున్నా!

సరోజ : అవును నిజమే. లేకపోతే నేనూ ఎప్పుడో వెళ్ళేదాన్ని. ఈ పోటీ మండినట్లే ఉంది. అసలు మగవాళ్ళు చెయ్యెట్లా కాల్చుకుంటారండీ. మా




వారికి కాఫీ పెట్టడం కూడా రాదు. అందుకనే నేను మూడు గంటలకే లేచి వంటంతా చేసి, కాఫీ కూడా ఫ్లాస్కులో పోసి పెట్టాను. ఎంతైనా అంత కటాబిటీగా మనం ఉండలేమండీ. ఏమం టారు, ఉమ గారూ?

ఉమ: ఆ అవును. నేనూ అంతే. చచ్చాననుకో—వారం నించీ పూరీలూ, కజ్జికాయలూ, జంతికలూ చేసి డబ్బాల్లో పొయ్యలేక! వీళ్ళ మొహం ఈ జడ్జీలు చూడొచ్చారా?

సీత : వీళ్ళా? వీళ్ళ కెంత సేపూ వాళ్ళ సింగారాలు, అందాలూ తప్ప ఇంకేం అక్కర్లేదు. ఆ మాట క్కొస్తే నేనూ కంది పొడీ, కారప్పొడీ లాంటివి చేసే వచ్చాను.

అన్నపూర్ణమ్మ : ఏమిటర్రా అంతా ఆ మూల కూచున్నారు? ఒక్కళ్ళూ ఉత్సాహంగా లేరేం? కేరవ్స్ ఆడదాం రండి. రా, మీనాక్షీ, ఉమా, సరోజా...

(కూర్చున్నాక) ఏమిటి మీనాక్షీ, మీరు మాట్లా డేది?

(సుశీలా, సీతా ఇంకో పక్క చెస్ ఆడుతుంటారు.)

మీనాక్షి : ఆ సుశీలమ్మ పిల్లాడికి పాలు కూడా కలిపి వచ్చిందిట! ఇది మన నిబంధనలకి విరుద్ధం కాదూ? పైగా బోడి గొప్పలు. వాళ్ళాయన రోజుకో పట్టు చీర కొంటున్నాట్ట! నిన్నటిదాకా మొగుణ్ణి దుమ్మెత్తి పోసిందా? జన్మకి ఒక్క పట్టు చీర కొనలేదని చెప్పిందా? ఇప్పుడు ప్లేటు మార్చింది!

అన్నపూర్ణమ్మ : అదిగో జడ్జీలు వస్తున్నట్లున్నారు. (లేస్తుంది.) (సుశీల ఉమని, మీనాక్షిని రమ్మని సైగ చేస్తుంది.)

సుశీల : ఏమిటి—మరీ అన్నీ ఆవిడకి చెప్తావు?

మీనాక్షి : నేనేం చెప్పలేదే?

సుశీల: చూడు ఉమా! నువ్వు వినలేదూ ఆవిడేం చెప్పిందో?

సీత : ఏమిటోయ్ గుసగుసలు...మామీదేనా?

సుశీల : అబ్బే మీమీద కాదులే.

మీనాక్షి : నేనిప్పుడే మొహం కడుక్కు వస్తా. (లోప లికి వెళ్తుంది. సరోజ అనుసరిస్తుంది.)

ఉమ : అన్నపూర్ణమ్మగారేది?

సుశీల : జడ్జీలు వస్తున్నారట—ఎదురెళ్ళింది.

ఉమ: ఆఁ. జడ్జీలా? మనం జాగ్రత్తగా ఉండాలి. రండి కబుర్లు చెప్పుకుంటూ ఉందాం!

సీత : భలే ఉందోయ్ నీ జోకు (పెద్దగా నవ్వుతుంది.)

ఉమ : హాయిగా ఉందోయ్ ప్రాణానికి ఇవాళ.

సుశీల : నాకూ అంతే. రోజూ ఇట్లాగే ఉండాలనుంది!

అన్నపూర్ణమ్మ : (ప్రవేశించి) పదండి. లంచ్ టైమయింది.

ఉమ : ఏరీ జడ్జీలు?

అన్నపూర్ణమ్మ : వచ్చి వెళ్ళారులే. భోజనానంతరం లోపలికి వస్తామన్నారు! (సరోజ పరుగెత్తుకుని వస్తుంది.)

సరోజ : మీనాక్షి ఇంటికి ఫోను చేస్తోంది రండి—రండి.

(ప్రవేశించి) అబద్ధం పచ్చి అబద్ధం.

ఈ సరోజ ఇంటికెళ్ళి వస్తుంటే నేను పట్టు కున్నాను.

ఉమ : ఇష్ అరవకండి. పదండి వెళ్దాం.

అందరూ వెళ్తారు.

కాసేపు విరామం.

(మీనాక్షి, ఉమ కలిసి వస్తారు.)

మీనాక్షి: ఏమయినా ఫస్టు ప్రైజు నాకే వస్తుంది. మాకు పిల్లలుగూడా లేరా. ఆయన ఒక్కరే అవస్థలు పడుతున్నా నేనసలు ఇంటి సంగతులు ఆలోచించనుకూడా లేదు.

సుశీల: (వస్తూ) నీ కెట్లా వస్తుంది? ఫస్టు నాకే రావాలి. చంటిపిల్లాణ్ణికూడా వదిలేసి, ఇల్లు ఎక్కడి దక్కడ వదిలేసి వచ్చాను నేను.

(సీతా, సరోజా వస్తారు)

ఉమ: ఇప్పుడే జడ్జీలు వచ్చెళ్ళారుగా? వాళ్ళతో మాట్లాడుతూ ఉన్నాను. నాకే వస్తుందనిపిం చింది. అందులోనూ ఆయన కసలు వంటకూడా రాదు. నాకు ఇంట్లో సహాయం చేయడానికి ఆడ పిల్లలుకూడా లేరు. ఆ సంగతి వాళ్ళకీ తెలుసు!

సీత: నువ్వు సెక్రటరీ వైనంత మాత్రాన నీకే వస్తుందని భ్రమపడకు. అసలు మీ కెవ్వరికీ రాదు. నాకు వస్తుంది. మా ఇంటికి చుట్టాలు కూడా వచ్చారు. అయినా నేను లెక్క చెయ్యకుండా వచ్చేశాను. ఫస్టు ప్రైజు నాకే రావాలి.

సరోజ: ఏ చుట్టాలు? మగలా, ఆడలా?

సీత: ఆడలు కాదులే—మొగలే. ఇల్లు మా ఆయనకే వదిలేశానులే.

సరోజ: నువ్వేం చేసినా ఫస్టు ప్రైజు నాకే వస్తుంది.

ఉమ: ఎందుకు? ఇంటి కెళ్ళి రూల్స్ బ్రేక్ చేసి నందుకా?

సరోజ: (ఉక్రోషంగా) మీరూ రూల్స్ బ్రేక్ చేశారు. పూరికే మాట్లాడకండి. జంతికలూ, కజ్జికాయలూ చేసి పెట్టి వచ్చిం దెవరో? తెలీదనుకున్నారా? ఈ సుశీలా అంతే—పిల్లాడికి పాలు అంటూ..

సుశీల: (ఒక్క ఉదుటున లేచి) మీ ఇద్దరూ పోట్లాడుకుంటూ మధ్య నన్ను లాగుతా వేం? పూరుకోను జాగ్రత్త!

మీనాక్షి: పూరుకోక పోవడమేం—నిజమేగా?

సుశీల: అక్కడికి నువ్వు నంగనాచివా? ఇంటికి ఫోను చేసి...

మీనాక్షి: నువ్వు చూశావా? నువ్వు చూశావంట?

సీత: అబ్బబ్బబ్బ. ఏమిటి మీ గోల? పూరుకోండర్రా

(అన్నపూర్ణమ్మగారు ప్రవేశం)

అన్నపూర్ణమ్మ: ఏమిటర్రా మీ అరుపులు బయటి దాకా వినిపిస్తున్నాయి. ఏమిటి అలా ఆట్లా ఉన్నారు? మీరు ఒక్క రోజన్నా రిలాక్స్‌డ్‌గా ఉండలేరా? ఎందుకంత సీరియస్‌గా ఉన్నారు?

(అందరూ నిశ్శబ్దం).

పూ. కూర్చోండి. రిలాక్స్ అవండి. ఇళ్ళ గురించి ఆలోచనలు మానెయ్యండి. నాలుగవుతూంది. ఈ రెండుగంటలూ కాస్త ఓపికపట్టండి. నవ్వుకుంటూ కబుర్లు చెప్పుకోండి. అంతేగానీ పోట్లాట లేమిటి?

సుశీల: కాదు, మేడమ్! అందరూ రూల్స్ బ్రేక్ చేశారు. పైగా ప్రైజు నాకు వస్తుందంటే, నాకు వస్తుందని వాదించు కుంటున్నారు.

సరోజ: నువ్వూ బ్రేక్ చేశావుగా?

అన్నపూర్ణమ్మ: అందరూ ఒక బండిలోనే ప్రయాణం చేస్తున్నారు. మీ లాంటి వాళ్ళు ఉండబట్టే ఈ మగవాళ్ళు మనల్ని ఆడిస్తున్నారు!

సీత: మేడమ్! రిజల్ట్సు ఎప్పుడు చెబుతారు?

అన్నపూర్ణమ్మ: రేపు సాయంత్రం నాలుగు గంటలకు ఇక్కడ మీటింగు ఉంది. ఆ మీటింగులో రిజల్ట్సు ఎనౌన్స్ చేస్తాం. మీరు రేపన్నా కరెక్ట్ టైముకి రండి. అదిగో జడ్జీలు వస్తు న్నారు. వాళ్ళని తీసుకు వస్తాను.

(అన్నపూర్ణమ్మ లోపలికి వెళుతుండగా తెర)

## 3

(అదే హాలు. అందరూ ఆసీనులై ఆత్రుతగా ఎదురు చూస్తూ ఉంటారు.)

(అన్నపూర్ణమ్మ లేచి గొంతు సవరించు కుంటుంది.)

అన్నపూర్ణమ్మ: మిత్రులారా! దేశమూ, కాలమూ ఎంతగా పురోగమించినా మధ్యతరగతి గృహిణి దృక్పథంలో మార్పు రానంత వరకు మనం పురోగమించ లేము. అవకాశం వచ్చినా, తన సంసారపరిధిని వదిలి ఒక్క రోజుకూడా బయటికి రావడానికి ఇష్టపడడం లేదు మన సగటు స్త్రీ.

మీనాక్షి: (చిన్నగా) అబ్బ ఈవిడా, ఈవిడ ఉపన్యాసమూను! తొందరగా ప్రైజుల సంగతి చెప్పదేం?

ఉమ: ప్రతి దానికీ చేంతాడంత ఉపోద్ఘాతం ఇవ్వడం ఈవిడకి అలవాటులే (చిన్నగా అంటుంది).

అన్నపూర్ణమ్మ: నవీన మహిళామండలి వారు నిర్వ హించిన నవీనమైన పోటీలో ఫస్టు, సెకెండ్ ప్రైజులు ఎవ్వరికీ రాలేదని చెప్పడానికి చింతి స్తున్నాం. రూల్స్ అతిక్రమించినప్పటికీ అందరూ ఓపిగ్గా పొద్దుట్నించీ సాయంత్రం వరకూ ఉన్నందుకు పాల్గొన్న ప్రతి ఒక్కరికీ ఒక్కొక్క బ్రౌంజు పీసు బహుమతిగా అంద జెయ్యాలని నిశ్చయించుకున్నాము.

అందరు: బ్రౌంజుపీసా? అన్యాయం!

సుశీల: మరి థర్డు ప్రైజు మాటేమిటి?

అన్నపూర్ణమ్మ: ఫస్టు సెకండ్‌లు ఎవ్వరికీ రానందుకు థర్డ్‌కూడా మేమే కాన్సిలు చేశాము. పోటీలో పాల్గొన్న వారందరికీ మా అభినందనలు అంద జేస్తున్నాం.

అందరు: మోసం...పచ్చి మోసం!

(అంటూండగా తెర)

(గమనిక: ఇందులో పాత్రలూ, సంఘటనలూ కేవలం కల్పితాలు. ప్రదర్శించదలచుకున్నవారు రచ యిత్రి అనుమతి పొందవలసి ఉంటుంది—మాధవ పెద్ది పుణ్యశీలాప్రసాద్). ★